సాక్షి సిద్దిపేట

గురువారం । 5 । డిసెంబర్ । 2024



దారి తప్పిన గురుకులాలు

గురుకులాల విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



కల్లు తాగించి ఆభరణాలు చోరీ

వృద్ధురాలికి కల్లు తాగించి ఆమెపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన భార్యాభర్తలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు 8లో ▸



తిరుగులేని 'పొద్దుతిరుగుడు'

పొద్దుతిరుగుడు సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచించారు. వివరాలు 9లో ▸

ఏడాదిలోనే రూ.1000 కోట్లు

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తా

- నాలుగు విడతల్లో రూ.938 కోట్ల రుణమాఫీ
- త్వరలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలలో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు
- ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదిస్తేనే మంత్రినయ్యా.. రుణం తీర్చుకుంటా...
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

"కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే హుస్నాబాద్‌కు రూ.1000 కోట్ల నిధులు తీసుకొచ్చా. మరో నాలుగేళ్లలో నిధుల వరద పారిస్తా. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్తా.. ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదిస్తేనే మంత్రిని అయ్యాను. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. త్వరలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలలో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను మంజూరు చేయిస్తా."అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఏడాది పూర్తవుతున్న సందర్భంగా బుధవారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే...



సాక్షి, సిద్దిపేట

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గౌరవెల్లి ప్రాజెక్టు కోసం జరిగిన పనులే తప్ప.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క కాలువ నిర్మించలేదు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి రూ. 437 కోట్ల నిధులను కాల్వల నిర్మాణం కోసం కేటాయించాం. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగానికి సాగు నీటిని అందించి సస్యశ్యామలం చేస్తాం. భూ నిర్వాసితులను సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేస్తాం. ఎల్కతుర్తి, భీమదేవరపల్లిలకు దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీళ్లందిస్తాం.

ఉచిత విద్యుత్‌కు రూ. 53 కోట్లు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. గృహజ్యోతి పథకం కింద జిల్లా వ్యాప్తంగా 1,95,680 సర్వీస్‌లకు రూ. 53.27 కోట్ల విలువ చేసే ఉచిత విద్యుత్‌ను అందించాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. మహాలక్ష్మి పథకం కింద రూ. 500లకు గ్యాస్ సిలిండర్‌ను 1,63,457 మంది లబ్ధిదారులకు అందించాం. ఇలా 4,84,963 గ్యాస్ సిలిండర్లకు రూ. 14.53 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

నాలుగు విడతల్లో రూ. 938 కోట్ల రుణమాఫీ

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.2లక్షల రుణమాఫీ చేశాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో విడత వారీగా అది కూడా రూ లక్షనే మాఫీ చేసింది. నాలుగు విడతల్లో కలిపి జిల్లా వ్యాప్తంగా 1,11,386 మంది రైతులకు రూ. 938.30 కోట్ల రుణమాఫీ చేశాం. రూ. 2 లక్షలకు పైగా ఉన్న వారికి సైతం త్వరలో రుణమాఫీ చేస్తాం.

ఇండస్ట్రియల్ పార్కు

అక్కన్నపేట మండలం చౌటపల్లిలో సుమారు వంద ఎకరాల భూమిని సేకరించి అందులో ఇండ్రస్టియల్ పార్కును ఏర్పాటు చేయబోతున్నాం. అగ్రి బెస్డ్ పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం. యువ పారిశ్రామిక వేత్తలను సైతం ప్రోత్సహించి వారికి బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించేందుకు కృషి చేస్తా. హుస్నాబాద్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇప్పటికే జాబ్ మేళాను నిర్వహించడంతో మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారు.

త్వరలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలలో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు

కోహెడ మండలంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశాం. దీని నిర్మాణం కోసం రూ 150 కోట్లు నిధులు మంజూరయ్యాయి. త్వరలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలో సైతం ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను నిర్మిస్తాం. ఎలాంటి వివక్ష లేకుండా అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం.

హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



హుస్నాబాద్ ప్రజలకు నేను ఎంతో రుణ పడి ఉంటా. ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తేనే మంత్రినయ్యాను. నియోజకవర్గాన్ని పర్యాటక, ఉపాధి, వ్యవసాయ, విద్యా. వైద్య రంగంలో ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. ఏడాదిలోనే హుస్నాబాద్ నియోజకవర్గానికి రూ. వెయ్యి కోట్ల నిధులను తీసుకొచ్చా. కొన్ని పనులు ప్రారంభమయ్యాయి కడూఆ. మరి కొన్ని టెండర్లు పూర్తయ్యాయి. హుస్నాబాద్ బస్టాండ్ పునరుద్దరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆర్టీఓ కార్యాలయం కోసం రెండెకరాల స్థలాన్ని కేటాయించాం., అలాగే కార్యాలయం నిర్మాణం కోసం రూ.3కోట్ల నిధులు కేటాయించాం. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మిస్తున్నాం. ఇప్పటికే ఒక విడత టెండర్లు పూర్తయ్యాయి. మరో విడత నిర్మాణం కోసం త్వరలో టెండర్లు పిలుస్తాం. ఎల్లమ్మ చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం. ఇప్పటికే రూ.20 కోట్ల నిధులను కేటాయించాం. హుస్నాబాద్ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తా.



చౌటపల్లి క్రాసింగ్ వద్ద నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్కు స్థలం ఇదే

రెండ్రోజుల్లో ఇండస్ట్రియల్ పార్కు నోటిఫికేషన్..?

- మూడు గ్రామాల శివారులో 130 ఎకరాల కేటాయింపు
- పరిహారం ఎకరానికి రూ.13 లక్షలు చెల్లించే అవకాశం!

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం కోసం రెండ్రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలిసింది. అక్కన్నపేట మండలం చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఈ పార్కు నిర్మాణానికి ప్రతిపాదించిన విషయం తెలిసిందే. మూడు గ్రామాల శివారులో నిర్మించనున్నారు. దాదాపు 126-130 ఎకరాల వరకు కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు సర్వేను పూర్తి చేశారు. చౌటపల్లి క్రాసింగ్ వద్ద సుమారుగా 85ఎకరాల 36గుంట భూమిని గుర్తించారు. ఇది గతంలో పేదలకు అసైన్డ్ చేసి ఇచ్చిన భూమి. జనగామ గ్రామ శివారులో సర్వే నంబర్లు 76, 77, 78, 79, 813, 814, 815లో సుమారుగా 24ఎకరాలు పట్టా భూములున్నాయి. అదేవిధంగా తోటపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్లు 478, 479, 480, 481లో 25 ఎకరాల వ్యవసాయ భూమిని గుర్తించారు. అయితే ఈ సర్వే నంబర్లలో సాగుపై ఉన్న రైతుల వివరాలు, అందులో ఉన్న చెట్లు, బావులు, బోర్లు తదితర వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. కాగా, ఇండస్ట్రీయల్ పార్కు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు దాదాపుగా రూ.12లక్షల నుంచి 13లక్షల వరకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. బహిరంగ మార్కెట్‌లో సుమారుగా రూ.3.5లక్షల ఉండగా.. దీనికి మూడింతలు కలుపుకొని భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించే అవకాశం ఉంది. ఏదేమైనా మెట్టప్రాంతంలో ఇండస్ట్రీయల్ పార్కు రావడం పట్ల రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

'ఉపాధి' పనులపై ఆడిట్ బృందం ఆరా



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలో ఉపాధి హామీ పనులపై ఇంటర్నల్ ఆడిట్ బృందం సభ్యులు పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా 2020 నుంచి 2023వరకు జరిగిన పనులపై క్షేత్రస్థాయిలో తిరిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారులు శేషుకుమార్, శ్యామల మాట్లాడుతూ ఉపాధి హామీలో జరిగిన పనుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈసీ పరశురాములు, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ తదితరులు ఉన్నారు.

'హరీశ్‌రావుకు జైలు తప్పదు'

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారంలో ఉన్నప్పుడు చిత్రహింసలకు గురిచేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్‌ట్యాపింగ్ కేసులో జైలుకు వెళ్లడం తప్పదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు, వర్కర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు మధు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ అధికార బలంతో ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురి చేసిన హరీశ్‌రావు పాపాలు పండాయన్నారు. త్వరలోనే అక్రమాలు బయటకు వస్తాయని, తగిన శిక్ష పడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడుతోందని, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

మంత్రి పొంగులేటికి జేఏసీ వినతిపత్రం



మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

కొమురవెల్లి (సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 2016లో నూతన జిల్లాలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత యువతకు అనేక విధాలుగా నష్టం జరిగిందని మంత్రికి తెలిపారు. దీనికి మంత్రి స్పందిస్తూ త్వరలోనే చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్, ఆగంరెడ్డి, గిరికొండల్‌రెడ్డి, అందె అశోక్, అందె బీరయ్య, మెరుకు శ్రీనివాస్, మెరుగు కృష్ణ, చెరుకు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా కార్యదర్శి భోగి శ్రీనివాస్ ఆరోపించారు. సిద్దిపేటలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు ఏమాత్రం తేడా లేదన్నారు. ఏడాదికాలంగా మార్పు పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని వివరించారు. మహిళలకు ప్రతీ నెల ఇస్తామన్న రూ.2,500, కల్యాణలక్ష్మీపెంపు, తులం బంగారం ఇంకా ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు దాబా నరేశ్ పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి

సిద్దిపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం ఆశావర్కర్లను పర్మనెంట్ చేసి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాములు గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, ఆశాలు ఎన్‌హెచ్‌ఎం పథకంలో భాగంగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని కేంద్ర ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదని వాపోయారు. అనంతరం వైద్యారోగ్య శాఖ అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

యాసంగికి సాగు నీరివ్వాలి

మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ



లేఖ రాస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: యాసంగి పంట కోసం సాగునీరు విడుదల చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే టి.హరీశ్ రావు బుధవారం లేఖ రాశారు. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల ద్వారా మూడేళ్లుగా రైతాంగానికి గోదావరి జలాలు అందించామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో రిజర్వాయర్ల ద్వారా సిద్దిపేట, మెదక్, యాదాద్రి, జనగామ జిల్లాల్లో సాగునీరు, తాగునీరు అందించినట్టు లేఖలో పేర్కొన్నారు. గతేడాది జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రాజెక్టుల వల్ల సుమారు 3 లక్షల ఎకరాల పంట పండిందని గుర్తు చేశారు. ప్రస్తుతం 19.03 టీఎంసీల నీరు కొండపోచమ్మ రిజర్వాయర్‌లో ఉందని, 9.5 టీఎంసీల నీరు రంగనాయక సాగర్‌లో ఉన్నాయని, 3.21 టీఎంసీల నీరు అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ఉందని హరీశ్ పేర్కొన్నారు. ఈ ఏడాది యథావిధిగా సాగునీరు అందించడానికి నీటి ప్రణాళిక కమిటీని ఆదేశించాలని కోరారు. ప్రస్తుతం మిడ్ మానేరులో 27టీఎంసీల నీళ్ల అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే మిడ్ మానేరు ద్వారా లిఫ్టింగ్ పద్ధతిలో జిల్లాలోని నాలుగు రిజర్వాయర్లకు ఎత్తి పోయాలని సూచించారు. ప్రభుత్వం సాగునీటి విషయంలో రైతులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పరిహారంపై స్పష్టత వచ్చేనా!

- ఉమ్మడి జిల్లాలో భూ బాధితులతో ఆర్డీఓల సమావేశాలు
- అధికారులు రైతుల మధ్య కుదరని పొంతన
- 54కి పైగా గ్రామాల్లో 4,500 ఎకరాలు
- ట్రిపుల్ఆర్ భూసేకరణ వ్యవహారం

గజ్వేల్: ట్రిపుల్ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) ఉత్తర భాగం భూసేకరణలో పరిహారంపై స్పష్టత తీసుకు రావడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్)లో భూ బాధితులతో ఆర్డీఓలు సమావేశాలను ప్రారంభించారు. తాజాగా బుధవారం గజ్వేల్‌లో ఆర్డీఓ వీవీల్ చంద్రకళతో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతుల డిమాండ్లకు, అధికారుల చెబుతున్న లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఈ నేపథ్యంలో పరిహారంపై స్పష్టత వచ్చేనా? అనేది చర్చనీయాంశంగా మారుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో భూ సేకరణను కోసం రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కాలా(కాంపీటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజైషన్)లు ప్రస్తుతం రైతులతో సమావేశాలను నిర్వహించి పరిహారం ఫైనల్ చేసే పనిలో పడ్డాయి. అందోల్–జోగిపేట కాలా పరిధిలో 8.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరుగనుండగా 5 గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. గజ్వేల్ పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు పనుల నిమిత్తం ఇక్కడ 17 గ్రామాల్లో, తూప్రాన్ పరిధిలో 14 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 8 గ్రామాల్లో, నర్సాపూర్‌లో 28 కిలోమీటర్ల జరుగనున్న రోడ్డు నిర్మాణం కోసం 14 గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. సంగారెడ్డి పరిధిలోనూ పది గ్రామాల వరకు భూసేరణ జరుగనుంది. మొత్తంగా ఐదు కాలాల పరిధిలోని 54కి పైగా గ్రామాల్లో 4,500 ఎకరాల వరకు భూ సేకరణ చేయనున్నారు. అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలను సేకరించనున్నారు.

భూ బాధితులతో ఆర్డీఓ సమావేశాలు

గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజపేట, మర్కూక్ మండలం అంగడికిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, బంగ్లా వెంకటాపూర్, వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్, నెంటూర్, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో మొత్తంగా 980 ఎకరాల భూసేకరణ జరగనుంది. తాజాగా బుధవారం గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ తదితర గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లింపు జరుగుతుందని రైతులకు చెప్పినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం అంటే మార్కెట్ ధరకు పొంతన ఉండదని తెలిసిందే.

రూ.కోట్లలో పలుకుతున్న ధర

రైతుల మాత్రం మార్కెట్‌లో తమ భూములు రూ.కోట్లలో ధర పలుకుతుందని, తమకు బహిరంగ మార్కెట్‌లో పలుకుతున్న ధర చెల్లించాలని ఆర్డీఓ వద్ద డిమాండ్ చేసి వచ్చినట్లు విలేకరులకు తెలిపారు. భూములే తమకు జీవనాధారమని, భూములు సేకరించిన తర్వాత జీవనోపాధి అవకాశాలు కూడా కల్పించాలని డిమాండ్ చేసినట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో పరిహారంపై స్పష్టత వచ్చేనా? అనేది వేచి చూడాల్సి ఉంది. ఆర్డీఓ సమావేశం సందర్భంగా ఏమైనా నిరసన ఎదురుకావొచ్చనే భావనతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆర్డీఓను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతున్న ట్రిపుల్ఆర్ భూ బాధితులు

మార్కెట్ ధర కోరినం

నాకు ఎకరా పది గుంటల భూమి ఉంది. మేం హెచ్ఎండీఏ పరిధిలో ఉండటం వల్ల మా గ్రామంలో ఎకరాకు రూ.కోట్లలో భూమి ధర పలుకుతుంది. మాకు మార్కెట్ ధర కంటే అధికంగా పరిహారం ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని ఆర్డీఓ మేడమ్‌ను కోరినం. అట్లయితేనే భూములు ఇస్తామని చెప్పినం.

– చింత పాపయ్య, భూబాధితుడు, సామలపల్లి, వర్గల్ మండలం

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులతో డీఈఓ, తదితరులు

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన కొండపాక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అశ్విని, అఖిల, గౌతమిని బుధవారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తెచ్చారని, అదే విధంగా జాతీయ స్థాయిలో పేరు తేవాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఎస్‌జీఎఫ్ ద్వారా అనేక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్‌నాయక్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎస్ఓ రామస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీపడొద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుళ్లిన కూరగాయలు వండొద్దు.. నాణ్యత విషయంలో రాజీపడొద్దు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్, మందాపూర్, పలుగుగడ్డ, కొండాపూర్, బిజివెంకటపూర్, బచ్చులగూడ, జగదేవ్‌పూర్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బట్టీ పట్టే చదువులు చెప్పొద్దు.. పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. గతంలో జాతీయస్థాయిలో నిర్వహించిన సర్వేలో మన రాష్ట్రం దిగువస్థాయిలో ఉందని, ఈ సారి రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం సైదులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై కేసులు ఎత్తివేయాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హరీశ్‌రావుపై కాంగ్రెస్ సర్కార్ కుట్రతోనే చక్రధర్ అనే వ్యక్తితో తప్పుడు కేసులు పెట్టిస్తుందని ఆయన ఆరోపించారు. దుబ్బాకలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతూ భయాందోళనలకు గురిచేస్తోందన్నారు. ఏడాది పాలనలోనే ప్రజలు విసిగిపోయి ఉన్నారని, పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులపై వేధింపు చర్యలకు పాల్పడటం సిగ్గు చేటన్నారు.

లోక కల్యాణం.. సుదర్శన హోమం



నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం బుధవారం నారసింహ సుదర్శన మూలమంత్ర హవనంతో అలరారింది. ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి ముఖమండపం వేదికగా లోక కల్యాణమే పరమావధిగా ఆలయ ఈఓ అన్నపూర్ణ సమక్షంలో అర్చక, వేద పండితులు ఈ మహాయాగం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. నృసింహుని దర్శించుకుని తరించారు.

– వర్గల్(గజ్వేల్)

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్ దేశాల్లోని ప్రఖ్యాత యూనివర్సిటీల్లో పీజీ, డాక్టర్ కోర్సులను అభ్యసిస్తున్న మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శీలు) విద్యార్థులు, స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత కల్గి, ఆసక్తి కల్గిన అభ్యర్థులు 31న సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హన్మకొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి బ్రాంజ్ మెడల్ సాధించింది. బుధవారం విద్యార్థినితోపాటు బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ సుజాతను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యాయులు ప్రభు, బాల సరస్వతి పాల్గొన్నారు.

మంత్రిపై అభిమానం


మంత్రి దామోదర చిత్రపటం

దుబ్బాక: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జన్మదినం (గురువారం) పురస్కరించుకొని దుబ్బాక పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కాముని మల్లికార్జున్ పెన్నుతో ఆయన చిత్రపటాన్ని వేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన అచీవ్‌మెంట్ సర్వే

హాజరైన 2,313 మంది విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల నిర్ధారణకు కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో పరక్-24 అచీవ్‌మెంట్ సర్వే టెస్టును బుధవారం నిర్వహించారు. జిల్లాలోని 97 ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి చదువుతున్న 2,313 మంది విద్యార్థులు ఈ అచీవ్‌మెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. సర్వేను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్, పరక్-24 అసోసియేట్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ పరిశీలించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నిర్మల

కోహెడరూరల్(హుస్నాబాద్):కోహెడ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బోయిని నిర్మలజయరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా భీంరెడ్డి తిరుపతిరెడ్డి, సభ్యులుగా మహ్మద్ అంకూస్, పులి రాజు, చామంతుల శ్రీధర్, గాదాసు రాజేందర్, దూలం శ్రీనివాస్‌గౌడ్, సుంకరి సారయ్య, బిజుగు యాదగిరి, చింతలపల్లి జనార్దన్‌రెడ్డి, మౌటం విజయ, చేపూరి శ్రీశైలం సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిర్మల మాట్లాడుతూ అన్నదాతలకు అవసరమైన వసతులను కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాధికారి పాల్గొన్నారు.

ట్రాఫిక్ బాబోయ్..

ఉరుకులు పరుగులు తీసినా.. కాలంతో పందెం వేసినా.. గజిబిజిగా తిరిగినా.. గందరగోళంగా గడిపినా.. అందరి గమనం భద్రమైన రేపటికోసమే.. అలాగని ఆదమరిచి ప్రయాణం చేస్తే ప్రమాదాలకు అవకాశం ఉంది.. జిల్లా కేంద్రంలో రోజురోజుకూ వాహనాల రద్దీ విరీతంగా పెరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర, నాలుగు, మూడు చక్రాల వాహనాల సంఖ్య దాదాపు 1,48,544 వాహనాలు ఉన్నాయి. వాటిల్లో అధిక వాహనాలకు పట్టణంలోనే తిరుగుతుడడంతో పాత బస్టాండ్, విక్టరీ చౌరస్తా, కరీంనగర్ రోడ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డు దాటేందుకు పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


పాత బస్టాండ్ సెంటర్లో ట్రాఫిక్ రద్దీ


ట్రాఫిక్ జామ్


రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న పాదాచారులు

దారి తప్పిన గురుకులాలు

- ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు
- గొడవలు, చోరీలతో పోలీస్‌స్టేషన్ బాట పడుతున్న విద్యార్థులు
- పాఠశాలల్లో నిద్రించని ఉపాధ్యాయులు
- ప్రైవేటు చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై దృష్టి
- ఆందోళకరంగా పిల్లల భవిష్యత్


హుస్నాబాద్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం

హుస్నాబాద్‌రూరల్: గురువుల సంక్షేమంలోనే విద్యార్థులను చేర్పితే చదువులో ముందుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ గురుకుల విద్యాయలయాల్లో పిల్లలను చేర్పిస్తున్నారు. గురుకులంలో చదివిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించడం, కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడి చదవుతుండటంతో చాలా మంది గ్రామీణ పిల్లలు గురుకులాల్లో చేరుతున్నారు. కానీ ప్రస్తుతం గురుకులాల విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండటానికి నివాసాలు ఉన్నా ఉండక పోవడంతో విద్యార్థులు గొడవలు పడటం, గోడలు దూకి బయటకు వెళ్లడం చేస్తున్నారు. ఈ ఘటనలన్నీ పోలీస్‌స్టేషన్‌ల వరకు చేరడంతో పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో సాంఘీక సంక్షేమ బాలుర గురుకులం, గిరిజన సంక్షేమ బాలురు, బాలికల గురుకులాలు, మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకులంతోపాటు, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, మీర్జాపూర్‌లో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఆరు గురుకులాల్లో 2,548 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో బాలురు 1,409 మంది, బాలికలు 1,134 మంది ఉన్నారు. గురుకులాల్లో ఉపాధ్యాయులు ఉండేందుకు ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించి, తాగు నీటి వసతి కల్పించారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకపోగా రోజు వంతుల వారీగా రాత్రి విధులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు ప్రభుత్వం ఉపాధ్యాయులు అలవెన్స్‌లు ఇచ్చినప్పుడు గురుకులంలో ఎందుకు ఉండరని ప్రశ్నిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీలు

జిల్లెలగడ్డలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు వసతి, తరగతి గదులతోపాటు ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మించారు. ప్రారంభంలో కొద్ది రోజులు గురుకులంలో ఉన్న ఉపాధ్యాయులు ఆ తర్వాత చీకటి పడగానే ఇండ్లకు వెళ్తున్నారు. పీఈటీ, పీడీలు గురుకులంలో ఉండి విద్యార్థులకు క్రమ శిక్షణ నేర్పించాలి. స్టోర్ గదుల తాళాలు విద్యార్థులకు అప్పగించి వెళ్లిపోవడంతో కొందరు విద్యార్థులు స్టోర్ రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్లను చోరీ చేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులను కొట్టారు. అనంతరం శిక్షకు గురైన విద్యార్థులు స్టోర్ ఇన్‌చార్జి, చెప్పిన విద్యార్థి పై దాడి చేశారు. ఈ గొడవ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి పోవడంతో పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. గతంలో ఒక విద్యార్థి కిటికి నుంచి దూకడంతో చేతి విరిగి ఆస్పత్రిలో చేరాడు.

ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే ఉండాలి



ప్రభుత్వ గురుకులంలో విద్యార్థులను సీటు వస్తే విద్యావంతులు అవుతారనే నమ్మకం ఉండేది. ఇప్పుడు గురుకులంలో ఉపాధ్యాయులకు క్వార్టర్స్ ఉన్నప్పటికీ ఎందుకు ఉండటం లేదు. విద్యార్థులు గురువుల పర్యవేక్షణలో ఉంటేనే క్రమశిక్షణ అలవాడు పడుతుంది, ఉపాధ్యాయులే లేకపోతే ఎట్లా? ప్రైవేటు భూ దందాలు చేయడం భూ వివాదంలో ఇరుక్కోవడం వల్ల విద్యార్థులకు చదువు చెప్పలేకపోతున్నారు. జిల్లా అధికారులు గురుకులాలను పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలి.

– పి.రవీందర్, బీఎస్పీ నాయకుడు

ప్రైవేటు చిట్టీల వ్యాపారంలో..

హుస్నాబాద్ మైనార్టీ బాలికల గురుకులంలో ఉద్యోగులు ధనార్జన పై ఆశతో ప్రైవేటు చిట్టీల వ్యాపారంలో చేరి మోసపోయిన ఘటన ఇటీవల వెలుగు చూసింది. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెల నెలా రూ.20 వేలు తిరిగి ఇస్తామని నమ్మబలిక ఓ వ్యాపారి దాదాపు రూ. 2 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేయడంతో ఈ పంచాయితీ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరింది. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చేరి బోగస్ రిజిస్ట్రేషన్లతో భూ వివాదంలో ఇరుక్కుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

100 టన్నుల అక్రమ ఇసుక స్వాధీనం


ఇసుకను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా డంప్ చేసిన ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం నర్సాపూర్ చౌరస్తా శివధర్మకంట సమీపంలో నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెల్లారం వెంకటకృష్ణారెడ్డి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను డంప్ చేశాడు. లారీలో అక్రమంగా రవాణ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసు సిబ్బంది దాడి చేసి 100 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు

- ఉద్యానవన , పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ యాష్మిన్ బాష
- బందారం గ్రామంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి వ్యవసాయ క్షేత్రం పరిశీలన


కాకర తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన కమిషనర్ యాష్మిన్ బాష

కొండపాక(గజ్వేల్)/నంగునూరు(సిద్దిపేట): సేంద్రియ ఎరువులతో ఉత్పత్తైన ఆహార పదార్థాలు ఆర్యోగానికి ఎంతో లాభదాయకమని ఉద్యానవన, పట్టుపరిశ్రమ కమిషనర్ యాస్మిన్ బాష పేర్కొన్నారు. కొండపాక మండలంలోని బందారం గ్రామ శివారులో రైతు అమ్మన రాజిరెడ్డి సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం కలెక్టర్ మనుచౌదరీతో కలిసి సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో కూరగాయల తోటల సాగు తీరులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పెట్టుబడులు, దిగుబడులు, పండించిన కూరగాయలను మార్కెటింగ్ చేయడం విషయంలో రైతు రాజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 35 ఎకరాల్లో సేంద్రియ ఎరువులతో కాకర, బీర తోటలను పందిరి సాగు పద్ధతిలో సాగు చేస్తున్నట్లు రైతు రాజిరెడ్డి కమిషనర్‌కు వివరించాడు. కాకర కాయలను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ప్యాకెట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాష్మిన్ బాష మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సాగుకు అవసరమయ్యే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతు రాజిరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి, జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి నిమ్మ ఇంద్రసేనారెడ్డి, ఉద్యానవన అధికారి సువర్ణ, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి : కలెక్టర్

నంగునూరు(సిద్దిపేట): జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు కొత్త రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ మను చౌదరి ఆయిల్ ఫెడ్ అధికారులకు సూచించారు. నంగునూరు మండలం నర్మేటలో రూ.300 కోట్లతో చేపట్టిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులను బుధవారం షేక్ యాస్మిన్‌బాషాతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ పనుల పురోగతి ఓవర్ హెడ్ ట్యాంక్, ల్యాబ్ స్టోరేజ్ భవనం, పామ్ ఫండ్ నిర్మాణాలు, ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి నిర్మాణం దశలు, ఆయిల్ తయారయ్యే విధానం, చేపట్టిన ఇతర నిర్మాణాలను మ్యాప్ ద్వారా ఆయిల్‌ఫెడ్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారులు, టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పాఠశాలలు అధ్వానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆదర్శ పాఠశాలలో అధ్వానంగా తయారు అయ్యాయని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతాలు, జిల్లా నాయకులు కమలాకర్ అన్నారు. బుధవారం గురుకులాల బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ఆదర్శ పాఠశాల, హాస్టల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో గురుకులాలు, పాఠశాలలు అభివృద్ధిలో పథంలో కొనసాగాయన్నారు. నాయకులు మహేశ్, సాగర్, కనకయ్య, రాజు, రవీందర్ తదతరులు పాల్గొన్నారు.

మైలారం విద్యార్థుల అడవిబాట

వర్గల్(గజ్వేల్): ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం వర్గల్ మండలం మైలారం జెడ్పీహైస్కూల్ విద్యార్థులు అడవిబాట పట్టారు. ఉపాధ్యాయులు నర్సయ్య, కృష్ణ, వేదశ్రీ, సంధ్య పర్యవేక్షణలో మైలారం సరిహద్దు చేరువలోని సంగాపూర్ కల్పకవనం సందర్శించారు. వారికి అటవీశాఖ గజ్వేల్ రేంజ్ అధికారి వినాయక్ అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పచ్చిరొట్టతో భూమికి బలం

సిద్దిపేటఅర్బన్: పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ విత్తనోత్పత్తి ద్వారా రైతులకు లాభంతో పాటు భూమికి బలం పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ చెప్పారు. గాడిచర్లపల్లిలో రైతు జుబేర్ సాగుచేస్తున్న జనుము విత్తనోత్పత్తి పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనోత్పత్తి సాగువల్ల రైతుకు ఆదాయంతో పాటు భూమికి సేంద్రియ పదార్థం లభిస్తుందన్నారు. పచ్చిరొట్ట పైరును పెంచి భూమిలో కలియదున్నే రైతులకు విత్తన కొరత లేకుండా ఉంటుందని, ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడితో పాటు పంట అవశేషాలతో ఆరు టన్నుల ఎరువు భూమికి లభిస్తుందని చెప్పారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

చెరువులో పడి మహిళ మృతి

హవేళిఘణాపూర్(మెదక్): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ మహిళ చెరువులో పడి మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔరంగాబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు.. హవేళిఘణాపూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన బానోత్ నీల(40) నిత్యం కూలి పని కోసం మెదక్ పట్టణానికి వెళ్తుండేది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. బుధవారం మండల పరిధిలోని ఔరంగాబాద్ శివారులో మహిళ మృతదేహం ఒడ్డున పడి ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన నీల అనే మహిళదిగా గుర్తించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. నీల మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో చిరు వ్యాపారి..

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ జిల్లా తొండిచౌడి గ్రామానికి చెందిన వరంజిత్ చౌహన్(23) బతుకుదెరువు కోసం గజ్వేల్‌కు వచ్చి పానీపూరి బండి నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. భార్యతోపాటు ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, మైనార్టీ నాయకులు ఇక్బాల్, సీఐటీయూ నాయకులు సందబోయిన ఎల్లయ్య, కేవీపీఎస్ నాయకులు కృష్ణమూర్తి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు..


వెంకట్‌రెడ్డి (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట):అనుమానాస్పద స్థితలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మండలంలోని బేగంపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుండ వెంకట్‌రెడ్డి (58) మండలంలోని దేవక్కపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సుమారు మూడు నెలల నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. బుధవారం తోటపల్లి చెరువు వద్ద అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాం. వారు వచ్చి వెంకట్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులు ఉద్యమ రథచక్రాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

హుస్నాబాద్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నడుంబిగించి ఉద్యమబాట పట్టిన కళాకారులు ఉద్యమ రథచక్రాలని రాష్ట్ర కళాకారుల కన్వీనర్ యెల్ల పోశెట్టి అన్నారు. స్థానిక వీఎల్ గార్డెన్‌లో బుధవారం కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 21న హైదరాబాద్‌లోని విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే కళాకారుల ఆత్మ గౌరవ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళాకారులకు అన్యాయం చేసిందని, కళాకారుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కమిటీని ఎంపిక చేశారు.

హరీశ్‌రావుపై కేసు పెట్టడం హాస్యాస్పదం

జింకల పర్వతాలు

చేర్యాల(సిద్దిపేట): మాజీ మంత్రి హరీశ్‌రావుపై చక్రధర్ గౌడ్ కేసు వేయడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకల పర్వతాలు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చక్రధర్ గౌడ్ గతంలో దొంగనోట్లు ముద్రించి పట్టుబడి జైలు జీవితం గడిపారని ఆరోపించారు. వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పుడు కేసులు పెడితే సహించం..

చిన్నకోడూరు(సిద్దిపేట): తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు పెట్టి మాజీ మంత్రి హరీశ్‌రావును జైల్లో పెట్టాలని చూస్తే తగిన శాస్తి జరగక తప్పదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, నాయకులు ఇట్టబోయిన శ్రీనివాస్, జంగిటి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. హరీశ్‌రావుపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలే తగిని బుద్ధి చెబుతారన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలకు చెందిన పలువురు పేద విద్యార్థులకు కరీంగర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ చైర్మన్ గోరిట్యాల వెంకటకిషన్‌రావు బుధవారం మాట్లాడుతూ.. సేవాభావం తమ క్లబ్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రావు, అమ్మ ఆదర్శపాఠశాల అధ్యక్షురాలు మంజుల, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, హెచ్‌ఎం మహ్మద్ పాల్గొన్నారు.

ఆర్థిక విధ్వంసంతోనే పథకాల్లో జాప్యం

- ఏడాది కాలంలో నియోజకవర్గానికి చాలా నిధులు తీసుకొచ్చా
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి
- మంత్రి పొన్నం ప్రభాకర్


రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని, గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంతోనే పథకాల అమలులో జాప్యం జరుగుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా, ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు రావొద్దని, ప్రజా సంక్షేమంలో లోటు లేకుండా చూడాలని ప్రజలంతా బాగుండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే మూడు మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. త్వరలో నాలుగు దేవాలయ కమిటీలకు కొత్త పాలకవర్గాలను నియమిస్తామన్నారు. పని చేసే వారికే పదవులు వస్తాయని, రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారు సిద్ధంగా ఉండాలన్నారు. మహాసముద్రం గండి, ఎల్లమ్మ చెరువు, సర్వాయి పాపన్న కోట, సింగరాయ జాతరలను టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. బస్వాపూర్, మోరెటి పల్లె గ్రామాలకు రంగనాయక సాగర్ నుంచి సాగు నీరు అందుతుందని, కొంత భూ సేకరణ జరగాల్సి ఉందన్నారు. సైదాపూర్ కెనాల్‌కు రూ.230 కోట్లు కేటాయిస్తే పూర్తవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు రూ.1,000 కోట్లకు పైగా నిధులు హుస్నాబాద్ నియోజకవర్గంలో వివిధ పనుల అభివృద్ధికి విడుదల అయ్యాయని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

మాటల మాంత్రికుడు రోశయ్య

ప్రతి పక్షాన్ని మాటల తూటాలు పేల్చడంలో కొట్టకనే కొట్టినట్లుగా మాట్లాడే కొణిజేటి రోశయ్య మాటల మాంత్రికుడని పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి రోశయ్య 3వ వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ చందు, ఆర్డీఓ రామూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్త శ్రీనివాస్, బెజుగం బాలకిష్టయ్య, చోల్లేటి శంకరయ్య, తణుకు ఆంజనేయులు, తేరాల మారుతి, కొండ్లె రాజేశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.